క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అంతర్గత సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో పలు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌గౌడ్, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

హోటల్‌పై చర్యలు తీసుకోండి

మణికొండ: నివాసిత ప్రాంతంలో హోటల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజూ డ్రైనేజీ నిండటానికి కారణం అవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అలకాపూర్ కాలనీ రోడ్డు నంబర్-1 నివాసితులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ డ్రైనేజీ నిండటంతో చుట్టుపక్కల ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీంతో సోమవారం కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ కోరారు. సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందజేసి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. సంబంధిత అధికారులు ప్రజావాణిలో పాల్గొంటారని, సమస్యను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని అన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు



సహస్రనామ స్తోత్ర పారాయణంలో భక్తులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్-13లో ఉన్న శ్రీసీతారామచంద్ర అభయాంజనేయ స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక పూజలు కొనసాగుతున్నాయి. పూజల్లో భాగంగా 3వ రోజు సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 10గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వి.నాగరాజ తెలిపారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి



ఏజీవర్సిటీ: పెంపుడు జంతువులకు వాటి యజమానులు తప్పని సరిగా ఏడాదికి ఒకసారైనా రేబీస్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, క్షయ, మొదలైన వ్యాధుల నుంచి రక్షణ కోసం టీకాలు తప్పనిసరి వేయించాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి జ్ఞానప్రకాష్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని క్లినికల్ కాంప్లెక్‌లో ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలకు ముప్పు కలిగించే వ్యాధుల పట్ల అత్యంత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఓపెన్ జిమ్‌లపై నిర్లక్ష్యం

- విరిగిపోయిన పరికరాలకు మరమ్మతులు కరువు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో విగిపోయిన పరికరాలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యం మెరుగుపడేందుకు ఉపయోగపడతాయని, ఉదయం, సాయంత్ర సమయాల్లో పార్కులకు వచ్చేవారి కోసం లక్షల రూపాయలు ఖర్చుచేసి పార్కులలో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటి పరిస్థితి అధ్వానంగా మారింది. ఓపెన్ జిమ్‌ల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు నాసిరకం అయినందున కొద్ది రోజులకే పాడైపోవడం, విరిగిపోవడంతో సమస్యలు తలెత్తాయి. పార్కులకు చాలా మంది వచ్చి ఆహ్లాదం కోసం, ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసేందుకు వస్తుంటారు. పార్కులలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల పరికరాలు విరిగిపోవడంతో అవి పూర్తిగా నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రతిరోజూ పార్కుకు వస్తున్న ప్రజలు నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యంపై ఆగ్రహం

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. 1వ డివిజన్‌లోని ఫ్రీడమ్ పార్కులో రూ.5 లక్షలతో, 5వ డివిజన్‌లోని కపిలానగర్ పార్కులో రూ.5 లక్షలతో, 18వ డివిజన్ ఆనందనగర్ పార్కులో రూ.5 లక్షలతో, 19వ డివిజన్‌లోని పంచతంత్ర పార్కులో రూ.10 లక్షలతో, మైకెల్ కాలనీ పార్కులో రూ.10 లక్షలతో, ఓపెన్ స్పేస్‌లో 10వ డివిజన్‌లోని సాయిబాబా కాలనీలో రూ.5 లక్షలతో, 14వ డివిజన్‌లోని పెబెల్ సిటీలో రూ.5 లక్షలతో, 16వ డివిజన్‌లోని భాగ్యనగర్ కాలనీ రూ.5 లక్షలతో, 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో ఎన్నో పరికరాలు పనిచేయకుండా పోయాయి. కనీసం వాటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలుమార్లు కోరినా పట్టించుకునే వారే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీల్లో చెత్త, వ్యర్థాలు వేయవద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: డ్రైనేజీల్లో చెత్త చెదారం, వ్యర్థాలు పారవేయవద్దని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 18వ డివిజన్ వీకర్ సెక్షన్ కాలనీలో తడి, పొడి, హానికరమైన చెత్తపై ఆయన కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ బి.శ్రీశైలం, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలి



వృద్ధులకు కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న సుష్మ

శంషాబాద్ రూరల్: సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పల్లిలో ఉన్న సేవా భారతి ఫౌండేషన్, ఐరిస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి వీటిని పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదరణ లేని వారి కోసం ఇక్కడి వృద్ధాశ్రమంలో సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు, ఫౌండర్ ఆర్.గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



రచయిత, తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య తదితరులు

అత్తాపూర్: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని రచయిత, తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య అన్నారు. అత్తాపూర్‌లోని లక్ష్మీనగర్ పార్కులో ప్లాస్టిక్ రహిత సమాజంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అనే అంశంపై ఆయన మాట్లాడారు. వాతావరణంలో ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం పర్యావరణాన్ని రక్షించుకుందాం అన్నారు. ప్రతి కుటుంబం ప్లాస్టిక్ రహిత ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు విద్యార్థులు, యువతలో చైతన్యం కలిగించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణ జీవ శాస్త్రవేత్త తిమ్మారెడ్డి, ఎం.నాగేశ్వర్‌రావు, రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ పౌల్ట్రీ డైరెక్టరేట్ డాక్టర్ టి.వి.రావు, మూర్తి, చలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు షురూ



ప్రారంభమైన రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: చిన్నపాటి వర్షాలకే రోడ్డంతా అస్తవ్యస్తంగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుండటంతో స్పందించిన మున్సిపల్ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్-16 వద్ద రోడ్డంతా అస్తవ్యస్తంగా మరిందని, వెంటనే మరమ్మతులు చేయాలని ఈ నెల 4వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'ప్యాచ్ వర్క్ చేయించండి' అనే శీర్షికన కథనం ప్రచురితమయ్యింది. దాంతో మున్సిపల్ డీఈ శివసాయి స్పందించి సోమవారం మరమ్మతులు ప్రారంభించారు. ఇదేవిధంగా మున్సిపాలిటీ వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తామని ఆయన తెలిపారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు

రాజేంద్రనగర్: ప్రధాని మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని, వాటి రద్దు కోసం కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి అన్నారు. సీపీఐ రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లోని కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రియాజ్, సీపీఐ అంబేడ్కర్‌నగర్ కార్యదర్శి బండారి శాంతమ్మ, జ్యోతి, ఆఫీస్ కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మణికొండ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ, మంద కృష్ణ మాదిగ 60వ పుట్టిన రోజు వేడుకలను గండిపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల ఇన్‌చార్జి పి.గణేష్ మాదిగ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మాదిగలకే కాకుండా అనగారిన వర్గాల ప్రయోజనాలకు ఎనలేని కృషి చేసిందన్నారు. మండల పరిధిలోని కోకాపేట, ఖానాపూర్, నార్సింగి, వట్టినాగులపల్లి, పీరంచెరువు, హిమాయత్‌సాగర్ గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరం



విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

రాజేంద్రనగర్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించాలని బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ సూచించారు. ఉప్పర్‌పల్లి ఎర్రబోడ ప్రైమరీ స్కూల్‌లో ఆమె సోమవారం విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇండోర్ గేమ్స్‌తో పాటు ఔట్ డోర్ గేమ్స్ విద్యార్థులకు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, నాయకులు మంజుల, సుజాత, సుమలత, గిరిబాబు, జయప్రకాశ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో క్వాంటం కంప్యూటింగ్ సదస్సు



ఎఫ్‌డీపీలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో క్వాంటం కంప్యూటింగ్, ఫౌండేషన్స్, అప్లికేషన్స్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సును సోమవారం ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన 25 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 99 మంది అధ్యాపకులు ఇందులో పాల్గొంటున్నారు. సదస్సు 12వ తేదీ వరకు కొనసాగుతుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూహెచ్ డీపీపీ డైరెక్టర్ డాక్టర్ వి.కామాక్షి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్వాంటం కంప్యూటింగ్ ప్రాముఖ్యత, ప్రస్తుత కాలానికి అవసరమైన అనువర్తనాల గురించి వివరించారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌డీపీకి హాజరవడం వలన అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డితో పాటు పలు కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో రన్నరప్‌గా రామంజాపూర్ జట్టు



క్రికెట్ పోటీలో రన్నరప్‌గా నిలిచిన రామంజాపూర్ జట్టును అభినందిస్తున్న మహేష్‌కుమార్

శంషాబాద్ రూరల్: విలేజ్ ప్రీమియర్ లీగ్ ఎస్ఎంసీ సీజన్ వన్‌లో మండలంలోని రామంజాపూర్ క్రికెట్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. సోమవారం ఫైనల్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.50 వేలు, రన్నరప్ జట్టుకు రూ.25వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను స్థానిక నాయకుడు పి.మహేష్‌కుమార్ అభినందించారు. ఇలాంటి టోర్నీలతో క్రీడాకారుల ప్రతిభ వెలుగు చూస్తుందన్నారు.

అబాకస్ పోటీలో సత్తా చాటిన బుద్వేల్ విద్యార్థులు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

అబిడ్స్: అబాకస్ పోటీల్లో బుద్వేల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తాచాటారు. తెలంగాణ ప్రాంతీయ స్థాయి సిప్ అబాకస్ పోటీల్లో బుద్వేల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కోచింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ ప్రియాంక పవర్ వెల్లడించారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో 4వ తరగతి విద్యార్థి భార్గవర్ రామ్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించగా మరో ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని ఆమె వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రియాంక పవర్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు

శేరిలింగంపల్లి: అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు మదర్ సేవా సమితి చైర్మన్ బద్దం కొండల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో రెండు ఫ్లోర్‌ల వరకు అనుమతులు తీసుకొని 5 నుంచి 7 అంతస్తుల వరకు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, దీంతో ఆయా ప్రాంతాల్లోని రోడ్లపై పార్కింగ్‌లు చేస్తున్నారని వివరించారు. దీని వలన స్కూల్ బస్సులు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

సెప్టెంబర్‌లో భాగ్యనగర్ 'టీఎన్జీఓస్' వేడుకలు

రాయదుర్గం: భాగ్యనగర్ టీఎన్జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇప్పించే విధంగా కృషి చేస్తామని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ మారం జగదీష్ స్పష్టం చేశారు. సోమవారం భాగ్యనగర్ టీఎన్జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం టీఎన్జీఓస్ కాలనీలోని సొసైటీ ప్రాంగణంలో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 3,4 తేదీలలో ఎల్‌బీ స్టేడియంలో టీఎన్జీఓస్ 80 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను నిర్వహించాలని తలపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,సభ్యులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. సోమవారం హెచ్‌సీయూ క్యాంపస్ పక్కన ఉండే గోపన్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలోని స్టూడెంట్స్ ఫర్ సేవా యూనిట్ పర్యవేక్షణలో పుస్తకాలను అందించారు. 9వ తేదీ ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవం పతాకావిష్కరణతో ముగుస్తుందన్నారు. జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాక్షి, బాలకృష్ణ, శివ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లీనప్ డ్రైవ్

హెచ్‌సీయూ క్యాంపస్‌లోని వైట్‌రాక్ ప్రాంతంలో క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. వ్యర్థాలు, చెత్తాచెదారం , వాటర్‌బాటిళ్ళు తదితరాలను తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.

లైబ్రరీ అభివృద్ధికి సహకరిస్తాం



లైబ్రరీని పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ తదితరులు

రాజేంద్రనగర్: లైబ్రరీలో పుస్తకాలు విద్యార్థులతో పాటు ఉద్యోగ అన్వేషణలో ఉన్న వారికి, పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని లైబ్రరీని ఆయన సోమవారం లైబ్రరీని పచ్చ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అక్కడ ఉన్న పుస్తకాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ తరపున లైబ్రరీ అభివృద్ధి కోసం సహకరించనున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్‌లో ఉన్న గ్రంథాలయం చుట్టుపక్కల ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థులు లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బస్తీల్లో జోనల్ కమిషనర్ పర్యటన



కాలనీల్లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని కాలనీల్లో జోనల్ కమిషనర్ హేమంత్ బొర్కడే, డిప్యూటీ కమిషనర్ వి. ప్రశాంతి, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సోమవారం పర్యటించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపీనగర్, నెహ్రూనగర్, లింగంపల్లి, పాపిరెడ్డినగర్‌లలో పర్యటించారు. అసంపూర్తిగా, పెండింగ్ పనులను త్వరితగతిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గోపీనగర్‌లో కమ్యూనిటీ హాల్, లింగంపల్లి అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్, పాపిరెడ్డినగర్ కమ్యూనిటీ హాల్, కాలనీలో లింకురోడ్డు, ఖిర్మించాలని జోనల్ కమిషనర్‌కు విన్నవించారు. వెంటనే ప్రణాళికలు రూపొందించాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఎంఅండ్ హెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ అమృతమ్మ, మేనేజర్ విక్రమ్ చంద్ర పాల్గొన్నారు.